ఈనాడు నంద్యాల
బుధవారం అక్టోబరు 2, 2024

దసరా మహోత్సవాలకు ముస్తాబైన శ్రీగిరి

● రేపటి నుంచి నవదుర్గ అలంకారాల్లో అమ్మవారి దర్శనం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రం దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. గురువారం నుంచి ఈ నెల 12 వరకు దసరా మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబాదేవి నిత్యం రాత్రి 7 గంటలకు నవదుర్గ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామిఅమ్మవార్లకు ఆలయ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో చెప్పారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణాలను విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు. తొలి రోజు గురువారం ఉదయం 8 గంటలకు భ్రమరాంబాదేవి ఆలయ యాగశాల ప్రవేశం చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 11న రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పించనున్నారు. 12న విజయదశమి పర్వదినం పురస్కరించుకుని ఉదయం 9.45 గంటలకు రుద్రయాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, వసంతోత్సవం, అవబృథం, త్రిశూలతీర్థోత్సవం క్రతులు జరుగుతాయి. రాత్రి 8 గంటలకు స్వామిఅమ్మవార్లకు తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో వెల్లడించారు.


విద్యుద్దీపాలంకరణలో ఆలయ ముందుభాగం

తేదీ	అలంకరణ	వాహన సేవలు
3	శైలపుత్రి	భృంగి
4	బ్రహ్మచారిణి	మయూర
5	చంద్రఘంట	రావణ
6	కూష్మాండదుర్గ	కైలాస
7	స్కందమాత	శేష
8	కాత్యాయని	హంస
9	కాళరాత్రి	గజ
10	మహాగౌరి	నంది
11	సిద్ధిదాయిని	అశ్వ
12	భ్రమరాంబాదేవి (నిజరూపాలంకరణ)	నంది

పశ్చిమ ప్రాంతానికి సాగునీరు

● ప్రజా వేదిక సభలో సీఎం
● కర్నూలు-బళ్లారి జాతీయ రహదారిగా మారుస్తాం

కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు సాగునీరివ్వడం నాకో పెద్ద సవాలు.. గుండ్రేవుల, గురు రాఘవేంద్ర.. ఆర్డీఎస్.. వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం.. పొలాలకు సమృద్ధిగా సాగు నీరు అందిస్తాం.. కర్నూలు నుంచి బళ్లారి వరకు జాతీయ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.. ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా మార్చుతాం.. కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటుచేసేందుకు చర్యలు వేగవంతం చేశాం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. "పేదల సేవ" కార్యక్రమంలో భాగంగా పత్తికొండ మండలం పుచ్చకాయలమడలో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలో కొందరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించి వారి యోగ క్షేమాలు తెలుసుకొన్నారు.. అనంతరం 'ప్రజావేదిక.. పేదల సేవ' సభలో మాట్లాడారు. పత్తికొండ ప్రాంతంలో హంద్రీనీవా ప్రధాన కాల్వ నుంచి అన్ని చెరువులకు నీళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకొని పనులు ప్రారంభించాం.. వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదన్నారు.. పుచ్చకాయలమడకు హంద్రీనీవా నీరు తీసుకొస్తామన్నారు. స్వర్ణాంధ్ర*2047 ప్రణాళిక తీసుకొస్తున్నాం.. తెలుగువారు ముందు ఉండాలన్నదే లక్ష్యం.. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో డ్రోన్ టెక్నాలజీ ద్వారా గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చడానికి చర్యలు వేగవంతం చేసినట్లు సీఎం ప్రకటించారు. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేయడం ద్వారా రాయలసీమ ప్రాంతంలో యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.

ఈనాడు, కర్నూలు, న్యూస్‌టుడే, పత్తికొండ, పత్తికొండ గ్రామీణం, పత్తికొండ పట్టణం

ఇంటికే కదిలొచ్చిన ఆసరా

"వేదన నిండిన గుండెల్లో ఆనందం వెల్లివిరిసింది. ఐదేళ్లలో ఎదురైన కష్టాలు తొలగిన సంతోషం. ఇంటికే కదిలొచ్చిన ఆసరా.. తలుపు తట్టిన భరోసా. స్వయంగా ముఖ్యమంత్రే తమకు పింఛను అందించేందుకు వచ్చారని గ్రామస్థులు సంబరాల్లో మునిగితేలారు. మధ్యాహ్నం 1.15 గంటలకు గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి తలారి గంగమ్మ, చింతగింజల వెంకటేశ్ల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. పింఛన్ అందజేసి వారి యోగక్షేమాలు తెలుసుకొన్నారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

చెల్లెమ్మలూ క్షేమమేనా..!

మధ్యాహ్నం 2.50 గంటకు ప్రజావేదిక సభ ప్రారంభం కాగానే ప్రజలకు అభివాదం చేస్తూ.. చెల్లెమ్మలు క్షేమమేనా.. తమ్ముళ్లూ కుశలమేనా.. అని పలకరించడంతో సభలో హర్షధ్వానాలు వినిపించాయి. ఐదేళ్ల కాలంలో తమ్ముళ్ల ముఖాల్లో చిరునవ్వులు చూడలేదని, మన ప్రభుత్వం రాగానే వారిలో ఆ ఆనందం కనిపిస్తోందని యువతను చూపుతూ.. ఆయన మాట్లాడారు. మూడు గంటల సేపు గ్రామస్థులతో గడపడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం 4.38 గంటలకు గ్రామం నుంచి బయలుదేరారు.

ఆదుకోని ఆరోగ్యశ్రీ

● రెండు మూత్రపిండాలు పాడయ్యాయి.. చికిత్స పొందే సమయంలో మంత్రి టీజీ భరత్ నాకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించి ప్రాణాలు కాపాడారు. వైకాపా హయాంలో ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా అమలు కాలేదు. నాలాంటి బాధితులు ఎంతో మంది ఉన్నారు. రూ.లక్షలు ఖర్చు చేయలేక, జబ్బు నయంకాక నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా పేదోడికి న్యాయం చేయాలి.

– సురేశ్, కిడ్నీ బాధితుడు

ముఖ్యమంత్రి: ఆరోగ్యశ్రీ పథకం మరింత మందికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం. సేవలు మరింత విస్తరిస్తాం. కొన్ని వ్యాధుల బారిన పడిన బాధితులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటాం.




ముఖాముఖిలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఇల్లు మంజూరు చేయండి

ఇంటి కోసం చాలాసార్లు దరఖాస్తు చేశాం. పేరు నమోదు చేసుకుంటున్నారు తప్ప మంజూరు కావడం లేదు. కొత్త ప్రభుత్వంలో గూడు నిర్మించుకోవచ్చని ఆశతో ఉన్నాం. ఇల్లు మంజూరు చేసి ఆదుకోండి. – నాగవేణి, గృహిణి

ముఖ్యమంత్రి: తక్షణమే ఇల్లు మంజూరు చేస్తాం.

ఆటోతో ఉపాధి చూపండి

ఊరిలో ఉపాధి ఉండటం లేదు. వ్యాపారం చేసుకునేందుకు ఆర్థిక స్తోమత లేదు. విద్యుత్తుతో నడిచే ఆటో ఇప్పిస్తే.. నడుపుకొంటూ జీవనం సాగిస్తా. నాపైనే ఆధారపడిన కుటుంబాన్ని ఆదుకోవాలి. – అశోక్

ముఖ్యమంత్రి: వెంటనే యువకుడికి ఆటో అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషాను ఆదేశించారు.

పుచ్చకాయలమడకు సీఎం వరాల జల్లు

పుచ్చకాయలమడలో రూ.1.38 కోట్లతో అంతర్గత రహదారుల నిర్మాణం, రూ.20 లక్షలతో ఉన్నత పాఠశాల ప్రహరీ, రూ.30 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణం, మినీ గోకులాల షెడ్లు, నీటి కుంటలు, పూడికతీత తదితర పనులు మరో రూ.87.75 లక్షలతో చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 203 మందికి ఇళ్లు, 48 మందికి కొత్త పింఛన్లు, 15 మందికి రేషన్‌కార్డులు, ఐదుగురికి ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు, 135 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు, 105 ఇళ్లకు మరుగుదొడ్లు ఏర్పాటు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


ప్రగతి పైలాన్ ఆవిష్కరిస్తున్న సీఎం

ఆరు నెలల్లో జ్యూస్ పరిశ్రమ

– టీజీ భరత్, మంత్రి



పత్తికొండ ప్రాంతంలో టమాటా జ్యూస్ పరిశ్రమను ఆరు నెలల్లో పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. స్థలం వివాదంలో ఉంది. త్వరలోనే పరిష్కరిస్తాం.

కర్ణాటక రాష్ట్రాన్ని కలిపేలా..

– బస్తిపాటి నాగరాజు, ఎంపీ



కర్నూలు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాలను కలుపుతూ కర్ణాటకలోని బళ్లారి వరకు హైవే నిర్మించాలి. ఆలూరు నియోజకవర్గంలో తాగు, సాగు నీటి కష్టాలు తీర్చేందుకు చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయాలి.

68 చెరువులు నింపాలి

– కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్యే



హంద్రీనీవా కాల్వకు ఇరువైపులా ఉన్న 68 చెరువులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి నింపాలి. పత్తికొండ ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలి. చెరువు పనులను తక్షణమే అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలి.

దసరాకు పప్పన్నం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : దసరా నేపథ్యంలో రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రేషన్ సరకుల పంపిణీలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయి. తూకాల్లో తేడాలుండటంతో జులై నుంచి కందిపప్పు పంపిణీ ఆపేశారు. సక్రమమైన కొలత, కొత్త ప్యాకింగ్‌తో సెప్టెంబరు నుంచి లబ్ధిదారులకు పంచదార పంపిణీ చేస్తున్నారు. అక్టోబరు నుంచి కందిపప్పు లబ్ధిదారులకు ఇస్తున్నట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు. కిలో రూ.67కు అందించనున్నారు.

○ నంద్యాల జిల్లాలో 10 పౌరసరఫరాల గోదాములున్నాయి. వీటి పరిధిలో 5.41 లక్షల మంది కార్డుదారులున్నారు. ఒక్కో నెలకు 541 టన్నుల కందిపప్పు అవసరం అవుతుంది. ప్రస్తుతం నంద్యాల ఎంఎల్ఎస్ పాయింట్‌కు 98 టన్నులు, ఆత్మకూరు, బనగానపల్లి, డోన్, నందికొట్కూరు ఎంఎల్ఎస్ పాయింట్లకు 44 టన్నుల చొప్పున కేటాయించారు. ఆళ్లగడ్డకు 29, కోవెలకుంట్ల 30, ప్యాపిలి 17, రుద్రవరం 22, శ్రీశైలానికి 3 టన్నులు కలిపి మొత్తం 375 టన్నులు కేటాయించారు. సోమవారం మూడు, నాలుగు లారీల కందిపప్పు వచ్చినట్లు సమాచారం. వచ్చిన సరకును పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చౌక దుకాణాలకు సర్దుబాటు చేశారు. మిగిలిన సరకు రెండు, మూడు రోజుల్లో రానుంది.

మొదటి రోజు కొందరికే..

ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమం మంగళవారం నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ప్రారంభమైంది. మొదటి రోజు కర్నూలు జిల్లాలో 43,578 మంది కార్డుదారులకు 6.44 శాతం సరకులు పంపిణీ చేయగా.. నంద్యాల జిల్లాలో 29,888 మంది కార్డుదారులకు 5.51 శాతం రేషన్ పంపిణీ జరిగింది. మొదటి రోజు రేషన్ పంపిణీలో కర్నూలు జిల్లాలో 1,979, నంద్యాల జిల్లాలో 531 మంది కార్డుదారులకు కందిపప్పు ఇచ్చారు. ప్రస్తుతం చౌక దుకాణాలకు కందిపప్పు సర్దుబాటు చేశామని.. బుధవారం నుంచి బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల అధికారులు తెలిపారు.


కందిపప్పు ప్యాకెట్లతో పాటు విడిగా డీలర్లకు స్టిక్కర్ల పంపిణీ

అరకొర సరకు పంపిణీ చేయలేం

ఒక్కో చౌక దుకాణానికి 35 కిలోల కందిపప్పు సరఫరా చేస్తే.. ఆ సరకును కార్డుదారులకు సరఫరా చేయలేమని ఇటు చౌక దుకాణాల డీలర్లు, అటు ఎండీయూ ఆపరేటర్లు చెబుతున్నారు. ఆ 35 కిలోల కందిపప్పు తీసుకెళ్తే కార్డుదారులు తిరగబడతారని కొందరు ఎండీయూ ఆపరేటర్లు వాపోతున్నారు. వచ్చిన సరకును వచ్చినట్లు చేరవేస్తామంటూ పౌరసరఫరాల అధికారులు, ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు చౌక దుకాణదారులకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు.

మహాత్ముని మాట..

కూటమి బాట

■ పల్లె ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక
■ పంచాయతీ ఖాతాల్లో రూ.56.10 కోట్లు
■ రూ.83 కోట్ల ఉపాధి నిధులతో రహదారులు

పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు.. అవి పచ్చగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది.. గ్రామ స్వరాజ్యం సాధనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమైంది.. స్థానిక సంస్థలు స్వపరిపాలన చేసినప్పుడే అది సాధ్యమవుతుంది. - మహాత్మా గాంధీ మాట.

నేడు గాంధీ జయంతి

ఊళ్లకు ఉరి వేసిన జగన్

జాతి నిర్మాతల ఆశయాలు.. రాజ్యాంగ అధికరణలను గత ఐదేళ్లు జగన్ అడుసులో తొక్కేశారు. ఊరంటే జనం కాదు.. బంధం, బంధుగణం ఐక్యతకు తార్కాణం. ఊరికి ఏం కావాలో అంతా ఏకమై చెప్పుకొనే స్వాతంత్ర్యాన్ని లాక్కొన్నారు. పల్లె ఖజానాను కొల్లగొట్టి.. అభివృద్ధికి అడ్డుకట్ట వేశారు. సర్పంచులను చులకన చేశారు.. ఆటబొమ్మలుగా మార్చారు. గ్రామ స్వరాజ్యానికి సమాధి కట్టారు. పల్లెల్లో ప్రగతి దీపాలను స్వహస్తాలతో కొండెక్కించారు.

కూటమి పల్లెకు వందనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పల్లె ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆగస్టు 23న ఉమ్మడి జిల్లాలోని 970 పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి నిధులతో గ్రామాల్లో చేపట్టాల్సిన వివిధ పనులపై ప్రజలు, అధికారులు చర్చించి తీర్మానాలు చేశారు. వీటికి అనుమతి లభించడంతో ఉమ్మడి జిల్లాలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.



నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా

కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రతి పల్లెలో అన్ని వసతులు కల్పించాలని నిర్ణయించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రహదారులు లేని గ్రామాల్లో చేయాల్సిన ప్రత్యామ్నాయ పనులపై కసరత్తు జరుగుతోంది. కర్నూలు జిల్లాలో రహదారులు లేని 11 గ్రామాలను గుర్తించారు. వీటికి రూ.9.50 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. చెంచుగూడేలకు నిధులు కేటాయించే క్రమంలో కొత్తపల్లి మండలం జానాలగూడెం గ్రామానికి 'పీఎం జన్‌మన్' పథకం కింద రూ.4.40 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇక్కడ పూర్తిస్థాయిలో ఎస్టీలు జీవనం సాగిస్తున్నారు. సంగమేశ్వరం ఆలయం నుంచి జానాలగూడెం వరకు గల 7 కి.మీ.ల విస్తీర్ణంలో రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వచ్చే అయిదేళ్లలో రహదారి లేని గ్రామం ఎక్కడా ఉండకూడదనే దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉప ముఖ్యమంత్రి మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఉపాధి నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, కాలువలు, వీధి దీపాలు, మంచినీరు, స్వచ్ఛత తదితర పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉపాధి నిధులతోపాటు వివిధ పద్దుల కింద వచ్చే అయిదేళ్లలో 1,232 పనులు చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దీనికి రూ.3,140 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు.

మార్గం సుగమం

ఒక్కో మండలానికి రూ.2 కోట్ల ఉపాధి నిధులు కేటాయించారు. గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి వీటిని వెచ్చించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,065 పనులు చేపట్టేందుకు రూ.83 కోట్లు కేటాయించారు. ఈనెల 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు పండగ వాతావరణంలో ఆయా నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉపాధి నిధులతో చేపట్టే రహదారుల పనులను లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ఇంటింటికి మంచినీరు

2019లో ప్రారంభమైన జల్‌జీవన్ మిషన్‌ను అప్పటి వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. నంద్యాల జిల్లాలో రూ.115 కోట్ల వ్యయంతో 522 పనులకు అనుమతి ఇవ్వగా రూ.82 కోట్లతో 232 పనులు మాత్రమే పూర్తి చేశారు. కర్నూలులో 1,026 పనులకు 293 పనులు పూర్తి చేసి. సుమారు రూ.197 కోట్లు ఖర్చు చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదు. చాలా నిధులు పక్కదారి పట్టాయి. దీనిపైనా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలు: 970 ◆ జనాభా (2011): 28.07 లక్షలు ◆ 15వ ఆర్థిక సంఘం నిధులు: రూ.56.10 కోట్లు

సహకార బ్యాంకులో

అక్రమాలపై విచారణ

● పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు సహకార బ్యాంకులో రూ.77 లక్షల స్వాహా చేసిన ఘటనపై సమగ్ర విచారణకు సీఈవో విజయ్‌కుమార్ ఆదేశించారు. ఏజీఎం గీతతోపాటు మరో నలుగురు బ్యాంకు అధికారులతో సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. బుధవారం సాయంత్రంలోగా విచారణ పూర్తి చేసి నివేదికలివ్వాలని పేర్కొన్నారు. ఘటనపై బ్యాంకు అధికారులు మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిని కలిశారు.

● సీఈవో విజయ్‌కుమార్, జీఎం శివలీల, డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి తదితరులు మంగళవారం బ్యాంకును సందర్శించారు. క్యాషియర్ అల్తాఫ్, అసిస్టెంట్ మేనేజర్ రంగయ్యను విచారించారు. తన సొంత వ్యాపారానికి రూ.77 లక్షలు వాడుకున్నట్లు క్యాషియర్ అల్తాఫ్ అధికారుల ఎదుట ఒప్పుకొన్నారు. అనంతరం బ్యాంకు అధికారులు ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో

204 మద్యం దుకాణాలు

● ప్రకటన విడుదల చేసిన అధికారులు

నంద్యాల పట్టణం	10
నంద్యాల గ్రామీణ	4
గోస్పాడు	3
బనగానపల్లి	7
కోవెలకుంట్ల	5
సంజామల	4
కొలిమిగుండ్ల	3
బేతంచెర్ల గ్రామీణ	3
అవుకు	2
నందికొట్కూరు పట్టణం	4
నందికొట్కూరు గ్రామీణ	2
మిడుతూరు	2
పగిడ్యాల	1
జూపాడుబంగ్లా	1
కొత్తపల్లి	1
పాములపాడు	1
డోన్ పట్టణం	4
డోన్ గ్రామీణ	2
బేతంచెర్ల	4
ప్యాపిలి	3
గడివేముల	2
పాణ్యం	2



కర్నూలు జిల్లాలో 99.. నంద్యాలలో 105 మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.. 2024-26 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అందుకు ఈ నెల 9వ తేదీ గడువు విధించినట్లు.. ఒక్క దరఖాస్తుకు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని.. ఒక అభ్యర్థి ఒకే దుకాణానికి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు.. దరఖాస్తు రుసుము వెనక్కి ఇవ్వరు.. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు.. అభ్యర్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ అనే మూడు పద్ధతుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం

ఎంత రుసుము చెల్లించాలంటే

● జనాభా, ప్రాంతాల ప్రాతిపదికన అనుమతుల రుసుమును ప్రభుత్వం నిర్ణయించింది.
● నంద్యాల పురపాలక సంఘం, ఇతరత్రా అన్ని ప్రాంతాలు.. మండలాల్లో మొదటి ఏడాది అనుమతి రుసుము రూ.65 లక్షలు, రెండో ఏడాది రూ.71.50 లక్షలుగా నిర్ణయించారు.
● మిగిలిన మండలాల్లో మొదటి ఏడాది రుసుము రూ.55 లక్షలు, రెండో ఏడాది రుసుము రూ.60.50 లక్షలుగా నిర్ణయించారు.

ఎక్కడి నుంచైనా

ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్ shttps:hpfspoject.comz ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పేరు, వివరాలు, గుర్తింపుకార్డు వివరాలు నమోదు చేస్తే చాలు. ఆన్‌లైన్‌పై అవగాహన లేనివారు స్థానిక మద్య నిషేధ, అబ్కారీ స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికిగాను స్టేషన్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. బ్యాంకు ఉద్యోగి, సచివాలయ ఉద్యోగి, అబ్కారీ శాఖ అధికారి అందుబాటులో ఉంటారు.

11న లక్కీడిప్

మద్యం దుకాణాల అనుమతులకు సంబంధించి ఈనెల 11న కర్నూలు జిల్లాకు సంబంధించి నగరంలోని జడ్పీ సమావేశ భవనం, నంద్యాలకు సంబంధించి కలెక్టరేట్‌లో లక్కీడిప్ ప్రక్రియ నిర్వహించి దుకాణాలు కేటాయిస్తారు. రెండు డిప్‌లు తీసి మొదట ఎంపికైన వ్యక్తికి మంజూరు స్తారు. రెండో డిప్‌ను రిజర్వ్‌లో ఉంచుతారు. మొదటి వ్యక్తి అనుమతి తీసుకోని పక్షంలో రెండో డిప్ వ్యక్తికి కేటాయిస్తారు.

ఆరో వంతు అక్కడికక్కడ చెల్లించాల్సిందే..

● లక్కీడిప్‌లో అనుమతులు దక్కించుకున్న వ్యక్తి.. అనుమతుల రుసుములో ఆరో వంతు చెల్లించాల్సి ఉంది. సదరు వ్యక్తి నిబంధనలకు అనుగుణంగా దుకాణం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది.
● అనుమతుల రుసుము ప్రతి రెండు నెలలకోసారి చెల్లించాల్సి ఉంటుంది.
● అనుమతుల ద్వారా వచ్చిన ఆదాయంలో 2 శాతం నిధులను మత్తు పదార్థాల నిరోధక చర్యలకు ప్రభుత్వం కేటాయిస్తుంది.
● ఈడిగ సామాజిక వర్గానికి రిజర్వ్ చేసిన దుకాణాల అనుమతులకు సంబంధించి ప్రత్యేక ప్రకటన వెలువడుతుంది. ప్రీమియం దుకాణం ఏర్పాటుకు సంబంధించి ప్రత్యేక ప్రకటన ఇస్తారు.


వివరాలు వెల్లడిస్తున్న నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్

ఆళ్లగడ్డ పట్టణం	4
ఆళ్లగడ్డ గ్రామీణ	2
శిరివెళ్ల	4
చాగలమర్రి	3
రుద్రవరం	3
దొర్నిపాడు	1
ఉయ్యాలవాడ	1
ఆత్మకూరు పట్టణం	4
ఆత్మకూరు గ్రామీణ	2
మహానంది	3
బండిఆత్మకూరు	3
వెలుగోడు	3
శ్రీశైలం	2

విద్యార్థి జీవితానికి విజ్ఞానవోదయం

☛ 2025-26కు విద్యా సంవత్సరానికి నూతన ప్రకటన

☛ ఈ నెల 7వ తేదీ వరకు గడువు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య ఉత్తమ విలువలు, నైపుణ్యాలు, దేశ భక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, ఎన్‌సీసీ వంటి వాటికి పేరొందింది జవహర్ నవోదయ విద్యాలయం. సామాన్య, బడుగు, బలహీనవర్గాల పేద విద్యార్థులకు సకల వసతులతో కూడిన విద్య నందించడం నవోదయ ప్రధాన ఉద్దేశం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత శిఖరాలకు చేరారు. ఈ విద్యాలయంలో చేరేందుకు 2025-26 సంవత్సరానికిగాను ఈ నెల 7వ తేదీ వరకు గడువు ఉంది.


చదువుకుంటున్న విద్యార్థులు

విద్యాలయంలో వసతులు

- **గ్రంథాలయం :** 10,800 పుస్తకాలు (ఆంగ్ల నిఘంటువులు, తెలుగు, హిందీ భాషా పుస్తకాలు)
- **శిక్షణ :** ఐఐటీ, నీట్, ఎన్‌డీఏ, ఏఐఈఈఈ, ఎయిమ్స్, ఎన్‌సీఆర్టీ
- **గదులు:** 1:40 నిష్పత్తిలో కుర్చునేందుకు అనువుగా
- **మైదానం:** ఉదయం 6 గంటల నుంచి 8 గంటలు, సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్రీడలు. ఖోఖో, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ ఆడేందుకు విశాలమైన మైదానం. ఫుట్‌బాల్, ఇతర పోటీల నిర్వహణకు ప్రత్యేక మైదానాలు తీర్చిదిద్దారు.
- **ప్రయోగశాలలు:** 4
- **విద్యాలయం విస్తీర్ణం :** 32 ఎకరాలు
- **విద్యార్థుల సంఖ్య :** 470
- **ప్రత్యేకతలు:** బాలుర, బాలికలకు వేర్వేరుగా భోజనశాల, డార్మెటరీ హాలు.
- **వసతి:** 10 బ్లాకులు, ఒక్కో గదిలో నలుగురు చొప్పున వసతి
- **ఏటా భర్తీ చేసే సీట్లు:** 80 మంది
- **తరగతులు:** 6 నుంచి 12వ తరగతి

దరఖాస్తు ఇలా చేసుకోవాలి

- https:///cbseitems.rcil.gov.in /nvs వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- 1-5-2013 నుంచి 31-07-2015 మధ్య జన్మించాలి.
- విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పాఠాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి ఐదోతో తీసుకున్న పాస్‌పోర్టు ఫొటో అతికించి సంతకం పెట్టాలి. తల్లిదండ్రుల లేక సంరక్షకులతో సంతకం చేయించాలి. ఐదో తరగతి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ద్వారా ధ్రువీకరణ చేయించి తిరిగి దానిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ :** 7-10-2024
- **పరీక్ష నిర్వహణ :** 18-1-2025
- **సీట్లు :** 80
- **అర్హత :** ఉమ్మడి జిల్లా విద్యార్థులు దరఖాస్తు వరకు
- **విద్యార్థులకిచ్చే ఆహారం :** ఉదయం రాగి జావా, స్నాక్స్, టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం

ప్రణాళిక ప్రకారం చదివిస్తాం - పద్మావతి ప్రధానాచార్యులు

బనవాసి నవోదయ విద్యాలయం



ఉత్తమ బోధనతోపాటు ప్రణాళిక ప్రకారం చదివిస్తాం, ఎక్కడా ఒత్తిడి చేయం. చిన్నారులతో స్నేహ పూర్వకంగా ఉంటాం. ప్రయోగశాలల్లో పూర్తిగా అవగాహన కల్పిస్తాం. ఒకటి, రెండుసార్లు ఆలోచించేలా తర్ఫీదు ఇస్తాం. ప్రతిరోజూ తరగతి ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది. పిల్లలకు ఏదైనా అనారోగ్యం తలెత్తినప్పుడు వెంటనే స్పందించి వైద్యమందిస్తాం.

ఆసనాల యోగం.. పతకాల భాగ్యం

☛ పోటీల్లో రాణిస్తున్న కస్తూర్బా బాలికలు ☛ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నిరుపేదలే.. ఆరోగ్యంలో ధనవంతులు. కుర్రుచేయడంలో ఆసనాలు వేస్తూ.. యోగాసనాలతో ఎత్తుకు ఎదిగారు. స్నేహానికి ప్రాణమిస్తారు.. బరిలో దిగితే పతకాలు సాధిస్తారు. చదువులో ముందుంటారు.. ఆటలో గెలుపుబాట. ఆటంకాలను దాటేస్తారు.. విజయాలు చేపడతారు. ఆసనాలు పోటీసన పట్టారు.. పోటీల్లో ప్రత్యేకతను చాటారు. ఆదోని పట్టణంలోని కస్తూర్బా బాలికల(జసల్) ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. - న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

ఆదోని పట్టణంలోని కస్తూర్బా బాలికల(జసల్) ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు యోగాలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ప్రిన్సిపల్ శాంతి, వ్యాయామ ఉపాధ్యాయిని సునంద విద్యార్థినులతో నిత్యం సాధన చేయిస్తున్నారు. కఠినమైన ఆసనాలు సైతం విద్యార్థినులు అవలీలగా వేస్తున్నారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు చదువుపై ఆసక్తి పెరగడం, ఆరోగ్యం, ఏకాగ్రత పెరుగుతోందంటున్నారు శిక్షకులు. రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థినులు సన్నద్ధమవుతున్నారు.



మమత.. పోటీలో ఘనత

ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మహేశ్వరమ్మ దంపతుల కుమార్తె బి.మమత 8వ తరగతి చదువుతుంది. రెండేళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయిని సునంద వద్ద యోగాలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. కర్నూలు నగరంలో జరిగిన యోగా పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. యోగాతో ఆరోగ్యం బాగుండటంతో పాటు ఏకాగ్రత పెరిగిందని.. కష్టపడి చదవి వైద్యురాలిగా స్థిరపడి ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నానని.. అందుకు తగినట్లుగా చదువుతున్నానని చెబుతోంది విద్యార్థిని మమత.

గాయత్రి గెలుపు మంత్రం

ఆస్పరి మండలం పుప్పాలదొడ్డి గ్రామానికి చెందిన ఈశ్వరప్ప, ముత్యమ్మ దంపతుల కుమార్తె సి.గాయత్రి ఏడో తరగతి చదువుతోంది. యోగాపై ఆసక్తితో ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. పలు ఆసనాలు అవలీలగా వేస్తూ.. ఆకట్టుకుంటోంది. రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నానని.. ఈ పోటీలో విజయం సాధిస్తానని చెబుతోంది గాయత్రి. కష్టపడి చదవి ఉపాధ్యాయినిగా స్థిరపడాలని లక్ష్యం పెట్టుకున్నానంటోంది.

దీపిక.. విజయాల మాలిక



ఆస్పరి మండలం ముత్తుకూరుకు చెందిన మద్దిలేటి, కృష్ణవేణి దంపతుల కుమార్తె జె.దీపిక ఎంపీసీ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. వీరిది రైతు కుటుంబం. యోగాసనాలు వేయడంతో తనకు తానే సాటి అన్నంతగా పట్టు సాధించింది. కర్నూలు నగరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థిని దీపిక ప్రతిభ చాటి అందరి ప్రశంసలు పొందింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కష్టపడి చదవి ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించటం తన లక్ష్యమని చెబుతోంది. యోగాలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రత్యేకతను చాటుతానని చెబుతోంది దీపిక.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం


పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకే పింఛను లబ్ధిదారులకు నగదు అందిస్తున్నట్లు తెలిపారు. నంద్యాలలోని 12వ వార్డులో మంగళవారం ఉదయం మంత్రి ఫరూక్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం పింఛను మొత్తాన్ని పెంచి ఒకటో తేదీనే ఇంటి వద్ద ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేశారని కొనియాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

దశలవారిగా పథకాలు అమలు

బనగానపల్లి గ్రామీణం న్యూస్‌టుడే : దశలవారిగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని రహదారి, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నందవరం గ్రామంలో బీసీ ఆధ్వర్యంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ని రూ.4వేలకు పెంచామని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో వందరోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమం సమపాలల్లో కొనసాగుతుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, చంద్రబాబు హయాంలో పంచాయతీలకు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. నందవరం గ్రామంలో రూ.50లక్షలతో సీసీ రహదారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. అంతకుముందు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య


నగదు అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కార్మికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షులు పీవీ కుమార్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో నాగరాజు, గ్రామ సర్పంచి, పంచాయతి, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

రంగురాళ్లతో మహాత్ముడి రూపం



నంద్యాల పట్టణానికి చెందిన 9వ తరగతి విద్యార్థి సాహిత్ గాంధీ జయంతి సందర్భంగా చిన్న చిన్న రంగురాళ్లతో మహాత్ముడి చిత్రాన్ని రూపొందించాడు. 13 అంగుళాల పొడవు, 10 అంగులాల వెడల్పుగల డ్రాయింగ్ షీట్‌పై 3,725 రంగురాళ్లను గాంధీ రూపం వచ్చేలా అతికించాడు. ఈ చిత్రాన్ని తయారు చేయడానికి 3 గంటల సమయం పట్టిందని, ఈ మైక్రో క్రాఫ్ట్ కళ అందరినీ ఆకట్టుకుంటోంని శిక్షకుడు కోటేశ్ తెలిపారు. విద్యార్థి సాహిత్‌ను ఆయన అభినందించారు.

- న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం, గాంధీచౌక్

2,12,712 మందికి పంపిణీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం కింద మొదటి రోజు 2,12,712 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం సాయంత్రానికి 97.47 శాతం మందికి నగదు అందజేసినట్లు వెల్లడించారు.

పింఛన్లు పంపిణీ చేయని సచివాలయ ఉద్యోగి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల రైతునగరం పరిధిలో సచివాలయ విద్య కార్యదర్శిగా పనిచేస్తున్న అబ్దుల్ రెహమాన్ అక్టోబరు 1న లబ్ధిదారులకు పింఛను డబ్బు పంపిణీ చేయలేదు. రూ.2.75 లక్షల పింఛను సొమ్మును సొంత ఖర్చులకు వాడుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇతను 39వ వార్డులో ప్రజల నుంచి వసూలు చేసిన పన్ను డబ్బును పురపాలక కార్యాలయానికి చెల్లించని కారణంగా అధికారులు సస్పెండ్ చేశారు. ప్రస్తుతం పింఛను డబ్బు వాడుకున్న విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. ఉదయం నుంచి పింఛను కోసం ఎదురు చూసిన లబ్ధిదారులు సాయంత్రమైనా ఇవ్వకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఇసుక మాయం ఘటనలో ఏఈపై చర్యలకు సిఫారసు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ మార్కెట్టు యార్డులో ప్రభుత్వ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఇసుక, మాయమైన ఘటనపై అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు హౌసింగ్ డీఈ నాగరాజు తెలిపారు. మార్కెట్టు యార్డులో 400 మెట్రిక్‌టన్నుల ఇసుక తక్కువగా ఉన్నట్లు తేలిందని, ఈ ఘటనపై హౌసింగ్ ఏఈ నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఏఈపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మార్కెట్టు యార్డులోని ఇసుక నిల్వ కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి మంగళవారం పరిశీలించారు.

అక్రమార్కులకు తహసీల్దార్ వత్తాసు

☛ కలెక్టర్ కన్నెర్ర ☛ మూడు ఇంక్రిమెంట్ల కోత

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : అవుకు ఇన్‌ఛార్జి తహసీల్దారు మల్లికార్జునరెడ్డికి మూడు ఇంక్రిమెంట్లు కట్ చేస్తూ కలెక్టర్ జి.రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది కిందట ఈయన పాణ్యం ఇన్‌ఛార్జి తహసీల్దారుగా పనిచేస్తున్న సమయంలో తమ్మరాజుపల్లె గ్రామంలో 3.92 ఎకరాల ప్రభుత్వ భూమికి మ్యుటేషన్ చేశారు. పట్టా భూములకు మాత్రమే మ్యుటేషన్ జరుగుతుంది. ఇక్కడ మాత్రం ప్రభుత్వ భూమికి కూడా మ్యుటేషన్ చేసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఆర్ఎస్ఆర్‌లో తప్పుడు పేర్లు నమోదు చేయడంతో పాటు ఈ అక్రమాల్లో పెద్దఎత్తున డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ దీనిపై విచారణ చేశారు. నాటి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి స్వయంగా తమ్మరాజుపల్లె భూముల దస్త్రాలను పరిశీలించి అక్రమాలు జరిగినట్లు నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో కొద్దికాలం ఈ విషయం పక్కనపెట్టారు. ప్రస్తుతం అక్రమాలు రుజువు కావడంతో మల్లికార్జునరెడ్డిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

కలెక్టరేట్‌లో దస్త్రం మాయం

పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామ పరిధిలోని 312-2, 313, 314 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉంది. దీనికి మ్యుటేషన్ చేశారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించి అక్రమాలు జరిగాయని తేల్చారు. మల్లికార్జునరెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ నివేదిక ఇచ్చారు. పాణ్యం తహసీల్దారు కార్యాలయం నుంచి కూడా నివేదిక తెప్పించుకున్నారు. కలెక్టరేట్ ఎ-సెక్షన్‌కు ఈ దస్త్రం చేరింది. ఆ తర్వాత ఈ దస్త్రం కనిపించలేదు. ప్రస్తుత కలెక్టర్ ఈ దస్త్రంపై పలుమార్లు అడిగినా కలెక్టరేట్ సిబ్బంది నుంచి సమాచారం రాలేదు. దీంతో సీసీ పుటేజీలను కూడా కలెక్టర్ పరిశీలించారు. దస్త్రం మాయం కావడంపై ఎ.సెక్షన్ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగానే దస్త్రం తప్పిపోయిందా? కావాలని మాయం చేశారా? అనే విషయంపై ఆరా తీశారు. ఈ క్రమంలోనే కొంతమందిపై చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయించారు. ఆ తర్వాత దస్త్రం వివరాలు తెప్పించుకుని ప్రస్తుతం మల్లికార్జునరెడ్డిపై చర్యలకు ఉపక్రమించారు.

5.75 కిలోల కణితి తొలగింపు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు మండలం ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన షంషూన్‌బీ అనే 55 ఏళ్ల మహిళ తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేవారు. ఆహారం అరగక పోవడంతో సమస్య తలెత్తుతుందని భావించి తాత్కాలికంగా మాత్రలతో కాలం వెల్లదీశారు. నొప్పి అధికం కావడంతో ఆసుపత్రికి వెళ్లగా ఆత్మకూరులోని అశ్విని ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రసన్నలక్ష్మీ, అనంతయాదవ్ పరీక్షించి కణితి ఉన్నట్లు నిర్ధారించారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద మంగళవారం ఆమెకు శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించారు. మహిళ కడుపు నుంచి తొలగించిన కణితి పేరు ఒవేరియన్ సిస్ట్ అనీ, హార్మోన్ల అసమతుల్యత కారణంగా ఏర్పడుతుందని వైద్యురాలు స్పష్టం చేశారు. ఒక వేళ ఈ కణితి కడుపులో విచ్ఛన్నమైతే ప్రాణాపాయం కలిగేదని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు.

వరద బాధితులకు సాయం

బనగానపల్లి, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితులకు మండల ముస్లిం మైనార్టీ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం, విద్యార్థులతో వసూలు చేసిన రూ.42వేల చెక్కును మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి మంగళవారం అందజేశారు. మంత్రి బీసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వరద బాధితులకు సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో గౌస్ ఏ అజాం స్కూలు, డాల్ఫిన్, ఆదర్శ విద్యామందిర్, నేషనల్ స్కూలు యాజమాన్యం పాల్గొన్నారు.


మంత్రి బీసీకి చెక్కును అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

డోన్ న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు 2వ వార్డులోని ప్రజలు రూ.25వేల సాయాన్ని అందజేశారు. స్థానిక 2వ వార్డు తెదేపా నాయకులు చిట్యాల రఘు, సరోజమ్మ తదితరులు నగదును మంగళవారం తెదేపా నాయకులకు అందజేశారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే : మండలానికి చెందిన ప్రైవేటు పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు. శారద స్కూల్ విద్యార్థులు రూ.10 వేలు, శ్రీ లక్ష్మి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రూ.8,220లు, జ్యోష్ణా పాఠశాల విద్యార్థులు రూ.5,300, ఆదిత్య స్కూల్ విద్యార్థులు రూ.3,113లు, లక్ష్మిరెడ్డి పాఠశాల విద్యార్థులు రూ.3 వేలు, శివజ్యోతి పాఠశాల విద్యార్థులు రూ.2,500లు చొప్పున విరాళాలు సేకరించారు. సేకరించిన మొత్తాన్ని మంగళవారం యూపీఎస్ఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ అక్బర్, ట్రెజరర్ పురుషోత్తానికి అందజేశారు.

రక్తదానం అత్యవసరం


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలు నిలపవచ్చని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. ప్రత్యేకించి ప్రమాదాలు జరిగిన సమయంలో రక్తదానం అత్యవసరమని అన్నారు. నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. యువత ద్విచక్ర వాహనాలను అధిక వేగంతో నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారని చెప్పారు. దీనికి స్వస్తి చెప్పి రక్తదానానికి ముందుకొచ్చి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేజర్ అమర్దీప్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ దస్తగిరి, ఉపాధ్యక్షులు మమతారెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల ఛైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి, ఉస్మాన్‌బాషా, నాగార్జున, సురేంద్ర, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల భూములు పోకుండా చూడండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : గ్రీన్‌కో ఎలక్ట్రికల్ పవర్ ట్రాన్స్‌మిషన్ లైను ఏర్పాటులో భాగంగా ఎస్టీల భూములు పోకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గ్రీన్‌కో ఎలక్ట్రికల్ పవర్ లైన్ ఏర్పాటుపై మంగళవారం సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ప్రాజెక్టు ఏర్పాటులో భాగంగా డోన్ డివిజన్‌లో 13.23 హెక్టార్లు, నంద్యాల డివిజన్‌లో 4 హెక్టార్ల భూములు సేకరించాల్సి ఉందన్నారు. ఇందులో షెడ్యూల్ కులాల వారి భూములకు భంగం కలుగకుండా గ్రామసభల్లో తీర్మానించిన ప్రతిపాదనలు చేయాలన్నారు. వాటిని జిల్లాస్థాయి కమిటీ పరిశీలించిన తర్వాత ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. జేసీ సి.విష్ణుచరణ్, ఐటీడీఏ పీడీ సురేశ్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, ఆర్డీవోలు మల్లికార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి, సబ్ డివిజనల్ అటవీ అధికారి సూర్యచంద్రరాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణలు పూర్తి చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఓటరు జాబితాలో సవరణలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం తన కార్యాలయం నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ- 2025పై జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఓటర్ల ఇంటింటి సర్వే ప్రక్రియ 99.07 శాతం పూర్తయిందన్నారు. 4,488 క్లెయిములు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 10, నంద్యాలలో 5 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు.


పట్టాలు తప్పిన వ్యాగన్లు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల మీదుగా విశాఖ పోర్టుకు పెట్రోలు వ్యాగన్లతో వెళ్తున్న గూడ్స్ రైలు మంగళవారం తెల్లవారుజామున పట్టాలు తప్పింది. నంద్యాల రైల్వేస్టేషన్‌లోని ఐదో లైన్‌లో చివరి మూడు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ఈ విషయాన్ని గుర్తించిన లోకో పైలట్ వెంటనే గూడ్స్‌ను ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే ముందుకెళ్లుంటే పెట్రోలుతో ఉన్న వ్యాగన్లు బోల్తాపడి భారీ స్థాయిలో మంటలు వ్యాపించేవని రైల్వే అధికారులు పేర్కొన్నారు. వెంటనే అధికారులు గుంటూరు నుంచి యాక్సిడెంటల్ రిలీఫ్ ట్రైన్‌ను తెప్పించి వ్యాగన్లను పట్టాలపైకి ఎక్కించారు. దీంతో మధ్యాహ్నం తర్వాత గూడ్స్ రైలు విశాఖ పోర్టుకు బయల్దేరి వెళ్లింది. గూడ్స్ వ్యాగన్లు పట్టాలు తప్పడం వల్ల కాచిగూడ- గుంటూరు వెళ్లే రైలును పాణ్యంలో, హుబ్బళ్లి- విజయవాడ రైలును నంద్యాలలో, డోన్ నుంచి గుంటూరు వెళ్లే రైలును బేతంచెర్లలో నిలిపివేశారు. దీంతో ఈ రైళ్లు రెండు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై రైల్వే ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

ఉరేసుకొని కౌలు రైతు బలవన్మరణం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉరేసుకొని కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిదేల గ్రామానికి చెందిన మద్దిలేటి(35) గత ఐదేళ్లుగా మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. మూడు సంవత్సరాల నుంచి వరుసగా నష్టాలు రావడంతో సాగు కోసం రూ.7 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక రోజూ మనోవేదనకు గురయ్యేవారు. దీంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య సుగుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

తేనెటీగల దాడిలో 15 మంది విద్యార్థులకు గాయాలు

పాములపాడు, న్యూస్‌టుడే: తేనెటీగల దాడిలో 15 మందికి గాయాలైన ఘటన పాములపాడు జడ్పీ పాఠశాలలో మంగళవారం చోటు చేసుకుంది. సాయంత్రం విరామ సమయంలో విద్యార్థులు మూత్ర విసర్జన చేసేందుకు ఆట మైదానం చివరికి వెళ్లారు. నీళ్ల ట్యాంక్‌పై భాగంలో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా విద్యార్థులపై దాడి చేశాయి. ఈ ప్రమాదంలో సుమారు 15 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు గాయాలపాలయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ వారిని పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సను అందించారు. అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు ఆయన వివరించారు.

వృద్ధులను కాపాడుకుందాం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : అనారోగ్య సమస్యలతో బాధపడే వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ

కుని వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని డీఎంహెచ్‌వో డా. వెంకటరమణ పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నంద్యాలలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ వైద్యాధికారి డా.కాంతారావు, వైద్యాధికారులు డా.జగదీశ్‌రెడ్డి, డా.శ్రీజ, డా.యశోద తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

శ్రీశైలం నీటిమట్టం 880.80 అడుగులు

సున్నిపెంట సర్కిల్ : శ్రీశైలం జలాశయం నీటిమట్టం మంగళవారం సాయంత్రం 6 గంటలకు 880.80 అడుగులు, నీటి నిల్వ 192.5300 టీఎంసీలుగా నమోదైంది. ఎగువనున్న జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 90,217 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 50,910 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) నందికొట్కూరు : 94403 61729, ఆత్మకూరు : 90149 09024, నంద్యాల : 98853 28120

ఆత్మకూరు పట్టణం : సమస్య : ఆర్టీసీ కాలనీలో మినీ ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. - నాగన్న

సమస్య : ఏకలవ్యనగర్ నుంచి అక్కిరాజుకాలనీకి వెళ్లే మార్గంలో మలుపు వీధిదీపం వెలగడం లేదు. - సుధాకర్

సమాధానం : ట్యాంకు పరిసరాలు శుభ్రం చేయిస్తాం. వీధిదీపానికి మరమ్మతులు చేయిస్తాం. - జీవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, షాహీర్‌బాషా, పురపాలక ఏఈ

పాడి పరిశ్రమకు పూర్వవైభవం

పాడి పరిశ్రమను ప్రోత్సహించడంలో భాగంగా మళ్లీ గోకులం, మినీ గోకులం షెడ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నియోజకవర్గాల వారీగా కొన్ని గ్రామాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో మొదటి విడతలో ఒక్కొక్కటి చొప్పున గోకులం షెడ్లు నిర్మించనున్నారు.

నియోజకవర్గం	గోకులం షెడ్లు
నంద్యాల	34
నందికొట్కూరు	89
శ్రీశైలం	63
పాణ్యం	24

పంచాయతీలకు ఆదాయం.. ప్రజలకు ఉపాధి

గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా చిన్ననీటి వనరుల్లో చేపల పెంపకం, ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించింది. ఈమేరకు గ్రామ పరిధిలోని చెరువుల్లో చేపల ఉత్పత్తికి అధికారులు చర్యలు చేపట్టారు. దీనివల్ల గ్రామ పంచాయతీల ఆదాయం సమకూరడంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తుంది.

☛ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా అన్ని గ్రామాల్లో రహదారుల వెంట మొక్కలు నాటుతున్నారు. పొలాల్లో పంట కుంటలు తవ్వేందుకు రైతులతో చర్చిస్తున్నారు.

ఇక ఇంటింటికీ రక్షిత జలం

నియోజకవర్గం	పనులు చేపట్టనున్న (గ్రామాలు)
నంద్యాల	32
నందికొట్కూరు	74
శ్రీశైలం	82
పాణ్యం	28

ఇంటింటికీ రక్షిత నీటిని అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జల జీవన్ మిషన్‌ను గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. ప్రభుత్వ వాటా నిధులు ఇవ్వకపోవడంతో పలు గ్రామాల్లో పనులు ఆగిపోయాయి. దీంతో గ్రామీణులకు రక్షితనీరు కలగానే మిగిలింది. ప్రస్తుత ప్రభుత్వం జల జీవన్ మిషన్ పథకం పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. మండలాల వారీగా చేపట్టాల్సిన పనులపై అధికారులు ఇప్పటికే సర్వే పూర్తిచేశారు. త్వరలో పైపులైన్లు, ఆగిపోయిన మంచినీటి పథకాల నిర్మాణాలను తిరిగి ప్రారంభించనున్నారు.



పొదల మాటున ప్రమాదం

నంద్యాల పట్టణంలోని బర్మశాలవీధిలో రహదారి పక్కనే విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ చాలా తక్కువ ఎత్తులో ఉన్న దీని చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ దారిలో వెళ్లే వారికి ఇక్కడ విద్యుత్తు నియంత్రిక ఉన్నట్లు కూడా తెలియడం లేదు. ఈ విషయం తెలియక బాటసారులు, వాహన దారులు రోడ్డు అంచుల వరకు వెళితే విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నియంత్రికను ఎత్తులో ఏర్పాటు చేసి, చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలు శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

పల్లెసీమలు..  ప్రగతి బాటలు

☛ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ☛ మౌలిక వసతుల మెరుగుకు ప్రభుత్వ చర్యలు ☛ నేడు మహాత్మా గాంధీ జయంతి

పల్లెలే దేశ ప్రగతికి పట్టుగొమ్మలని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. అలాంటి పల్లెలు అభివృద్ధికి దూరంగా అసౌకర్యాల్లో నలిగిపోతున్నాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల అభివృద్ధి మరుగునపడింది. పంచాయతీల నిధులు దారి మళ్లించి ఖజానా ఖాళీ చేశారు. దీంతో పల్లెల్లో చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కరించలేని దుస్థితి దాపురించింది. ఈ పరిస్థితుల్లో మూడు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ముందుగా వంద రోజుల ప్రణాళిక అమలు చేసింది. ప్రస్తుతం ఏడాది లక్ష్యం నిర్దేశించుకుని కార్యాచరణ దిశగా సాగుతోంది.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

మళ్లీ చెత్త నుంచి సంపద



పాణ్యంలో పునః ప్రారంభానికి సిద్ధమైన సంపద సృష్టి కేంద్రం

గ్రామాల్లో ఇంటింటా చెత్త, వ్యర్థాలు సేకరించి.. సేంద్రియ ఎరువుగా, పునర్వినియోగ వస్తువులుగా మార్చి పంచాయతీలకు ఆదాయం సమకూర్చే లక్ష్యంతో నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలను మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అక్టోబరు 2న వాటిని పునః ప్రారంభించాలని ఆదేశించింది. ఈమేరకు అధికారులు ఈ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వందకుపైగా కేంద్రాలను సిద్ధం చేశామని డీపీవో మంజులవాణి తెలిపారు.

నియోజకవర్గం	సంపద సృష్టి కేంద్రాలు
శ్రీశైలం	48
నంద్యాల	32
నందికొట్కూరు	34
పాణ్యం	34
(పాణ్యం, గడివేముల మండలాలు)	

ఐదేళ్ల తర్వాత పంచాయతీలకు నిధులు

ఐదేళ్లుగా నిధులకు నోచుకోని పంచాయతీలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను ప్రత్యేకంగా విడుదల చేసింది. సగటున ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు అందాయి. ఈ నిధులతో ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు ఇవ్వడం, బ్లీచింగ్ పొడి చల్లడం వంటి కార్యక్రమాలు ముమ్మరం చేశారు. నీటి పథకాలు, వీధిదీపాల మరమ్మతులు చేపట్టారు.

నియోజకవర్గం	విడుదలైన ఆర్థిక సంఘం నిధులు (రూ.కోట్లలో)
నంద్యాల	4.23
నందికొట్కూరు	8.93
శ్రీశైలం	7.89
పాణ్యం	2.93

మురుగు.. ఇక కనుమరుగు

గ్రామాల్లో వర్షంనీరు, మురుగు నిల్వ ఉండకుండా కాల్వలు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. నియోజకవర్గాల వారీగా డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కోసం గ్రామాలను ఎంపిక చేశారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో కాల్వల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. ఇది కార్యరూపం దాల్చి కాల్వలు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో మురుగు బాధలు తప్పనున్నాయి. పారిశుద్ధ్యం మెరుగవ్వడంతో పాటు దోమల బెడద తీరనుంది.

నియోజకవర్గం	నిర్మించనున్న మురుగు కాల్వలు
నంద్యాల	123. కి.మీలు
నందికొట్కూరు	162.కి.మీలు
శ్రీశైలం	143 కి.మీలు
పాణ్యం	93 కి.మీలు



కానాలలో కాల్వల్లేక అపరిశుభ్రంగా ఉన్న రహదారి

వరిలో పొటాష్ ఎరువులు వాడండి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : వరిలో పొటాష్ ఎరువులు వాడటం వల్ల పంటలో రోగ నిరోధకశక్తి పెరు



కొత్తపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు

గుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లె, బిల్లలాపురం గ్రామాల్లో మంగళవారం వరి పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన పొటాష్ వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కొత్తపల్లె సర్పంచి నారాయణ, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

గడివేముల, న్యూస్‌టుడే : సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ఒండుట్ల, పైబోగుల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. పత్తి, పొగాకు పంటలను పరిశీలించారు.

రైతులకు న్యాయం చేయండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో గ్రీన్‌కో కంపెనీ యాజమాన్యం దౌర్జన్యం వల్ల పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిన్నాపురంలో నిర్మిస్తున్న విద్యుత్తు ప్రాజెక్టు కోసం రైతులను బెదిరించి తక్కువ ధరకు భూములు తీసుకోవడం దుర్మార్గమన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ సమగ్ర విచారణ జరిపి దౌర్జన్యం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. రైతులకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఆపే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఏఐవైఎఫ్ మాజీ నాయకుడు బాబాఫక్రుద్దీన్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు స్పష్టం చేశారు. నంద్యాల బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మంగ



నిరాహార దీక్ష చేస్తున్న వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు

ళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, నాయకులు ప్రసాద్, సోమన్న, నరసింహులు, శివ, సురేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి బాలికల ఎస్‌జీఎఫ్ పోటీలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరులో మంగళవారం నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీలను ప్రధానాచార్యుడు షేక్షావలి ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో బాలికలు వివిధ పోటీల్లో తలపడ్డారు. క్రీడల నిర్వాహకులు, పీడీ, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : వరద బాధితుల సహాయార్థం నంద్యాలకు చెందిన చిన్న పిల్లల వైద్యుడు డా. పెసల అశోక్‌కుమార్ రూ.25 వేల ఆర్థిక సాయం



మంత్రికి చెక్కు అందజేస్తున్న డా.అశోక్‌కుమార్

అందించారు. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్యాం, శ్యామ్‌సుందర్ గుప్తా, డా.జఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల కోసం ఉయ్యాలవాడ మండలం కొండుపల్లి గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.11 వేల విరాళం అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఈ మొత్తాన్ని కలెక్టర్ జి.రాజకుమారికి అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

వెలుగోడు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో అభివృద్ధి, పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



పింఛను డబ్బు అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

పేర్కొన్నారు. వెలుగోడు ద్వారకానగర్‌లో సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను, సంక్షేమ పథకాలు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో అమానుల్లా, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఖలీలుల్లాఖాన్, నాయకులు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్లతో ఆర్థిక భరోసా

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పెంచిన పింఛన్లతో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా ఉంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జయసూర్య పేర్కొన్నారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేసి మాట్లాడారు. తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, వీరం ప్రసాద్‌రెడ్డి, మిడుతూరు మండల కన్వీనర్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : యువత మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకుని ఒత్తిడిని జయించాలని మానసిక వైద్య నిపుణురాలు డా.ఆరిఫాబాను సూచించారు. స్థానిక నేషనల్ విద్యా సంస్థల్లో మంగళవారం



అవగాహన కల్పిస్తున్న డా.ఆరిఫాబాను

ముస్లిం ఐకాస ఆధ్వర్యంలో 'సైబర్ భద్రత, ఆత్మహత్యల నివారణ' అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిఫాబాను మాట్లాడుతూ.. మానసిక వ్యాధులకు ప్రస్తుతం మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. రెండో పట్టణ ఎస్సై సురేశ్ మాట్లాడుతూ.. ఓటీపీ, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. ఐకాస కన్వీనర్ మౌలానా అబ్దుల్లా, గౌరవాధ్యక్షులు అబ్దుల్‌సమద్, వైద్యులు డా.మహ్మద్ రఫీ, డా.జఫ్రుల్లా, నేషనల్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, అతాఉల్లా ఖాన్, నంద్యాల సైబర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

గడివేముల, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిందాల్ అధికారి రవికుమార్ చెప్పారు.



అభ్యసన సామగ్రి అందిస్తున్న జిందాల్ అధికారి రవికుమార్, ఎంఈవో

గడివేముల జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మంగళవారం అభ్యసన సామగ్రి పంపిణీ చేశారు. కంప్యూటర్ లేకుండా కోడింగ్ విధానాన్ని అమలు చేసే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని 550 మంది విద్యార్థులకు రూ.10 లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసినట్లు చెప్పారు. కంప్యూటర్ లేకుండా కోడింగ్ చేసేలా 11 పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో విమలా వసుంధరాదేవి, ప్రధానోపాధ్యాయులు విక్టర్ ఇమ్మానియేల్, శైలజ తదిరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు రామరాజు తెలిపారు. మండలంలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఆదర్శ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, విజయానికేతన్ తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

జేఎన్‌టీయూఏ బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : జేఎన్‌టీయూఏ బాస్కెట్ బాల్ జట్టును ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ క్రీడా సంచాలకులు జ్యోజిరెడ్డి తెలిపారు. మండలంలోని



బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జేఎన్‌టీయూఏ బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. 30 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 139 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన వెల్లడించారు.

నేడు మద్యం దుకాణాలు బంద్

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : గాంధీ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లు బంద్ చేయిస్తున్నట్లు ఈఎస్ ఎస్.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రాణదాతలుగా నిలవండి

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే : యువత స్వచ్ఛందంగా రక్తమిచ్చి ప్రాణదాతలుగా నిలవాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు



యువతకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డా.రవికృష్ణ, క్లబ్ సభ్యులు

డా.రవికృష్ణ పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గురురాఘవేంద్ర బ్యాంక్ శిక్షణ కేంద్రంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డా.రవికృష్ణ ప్రారంభించారు. రక్తదానం చేసిన యువతకు ప్రశంసాపత్రాలు అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, సభ్యులు నాగరాజు, చంద్రశేఖర్, గురురాఘవేంద్ర శిక్షణ కేంద్రం డైరెక్టర్ మౌలాలిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామసభల విజయవంతానికి ప్రత్యేకాధికారులు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని అన్ని పంచాయతీల్లో బుధవారం నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీవో సుగుణశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు, ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. ఈ గ్రామ సభలకు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ముందస్తు దసరా సంబరాలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలను



అమ్మవారి వేషధారణలో విద్యార్థులు

జరుపుకొన్నారు. విద్యార్థులు అమ్మవారి వేషధారణలో అలరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది క్షేత్రంలో ఈ నెల 3 నుంచి జరిగే దసరా మహోత్సవాలకు హాజరవ్వాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని దేవస్థానం ఈవో శ్రీనివాసరెడ్డి ఆహ్వానించారు. వెలుగోడు మండలం వేల్పనూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన్ను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

సభ్యత్వ నమోదుతో కుటుంబానికి భరోసా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : తెదేపా సభ్యత్వ నమోదు కార్యకర్తలకు గుర్తింపు మాత్రమే కాదని, వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కూడా కల్పిస్తుందని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో మంగళవారం తెదేపా సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా ముఖ్య కార్యకర్తలు, కౌన్సిలర్లు, యూనిట్, క్లస్టర్, వార్డు ఇన్‌ఛార్జిలతో ఫిరోజ్ సమా



మాట్లాడుతున్న ఎన్ఎండీ.ఫిరోజ్

వేశం నిర్వహించారు. కౌన్సిలర్లు శ్యామ్, నాగార్జున, శ్రీదేవి, జైనాబి, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఖలీల్, గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

కురుకుంద (ఆత్మకూరు పట్టణం), న్యూస్‌టుడే : మండలంలోని కురుకుంద జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రాజు యోగాలో, ఇంతియాజ్ కబడ్డీలో జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి మంగళవారం తెలిపారు. బాలికల జట్టు వాలీబాల్ విభాగంలో విజేతగా నిలవగా బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచిందన్నారు.

హుసేన్.. చరణ్.. క్రీడల్లో ధనాధన్

రాష్ట్రస్థాయిలో నందికొట్కూరు విద్యార్థుల ప్రతిభ

నందికొట్కూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపుతున్నారు. సరైన వసతులు, శిక్షణ లేకున్నా పట్టుదలతో నేర్చుకుని పోటీల్లో సత్తా చాటుతున్నారు. నందికొట్కూరు పట్టణంలోని కోటా ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఖాజాహుసేన్ బాస్కెట్‌బాల్‌లో, కాటెపోగు చరణ్ ఫుట్‌బాల్‌లో రాణిస్తున్నారు. సెప్టెంబరు 21న కర్నూలు క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-17 పోటీల్లో వీరు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

జాతీయ స్థాయిలో రాణించాలని..



నందికొట్కూరు పట్టణం బైరెడ్డిశేషశయనారెడ్డి నగర్‌కు చెందిన ఆసిక్‌హుసేన్, బీబీ దంపతుల కుమారుడు ఖాజా హుసేన్. స్థానిక కోటా ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నాడు. బాస్కెట్‌బాల్ క్రీడపై ఆసక్తితో నేర్చుకున్నాడు. రోజూ సాధన చేస్తూ నైపుణ్యాలు మెరుగుపర్చుకున్నాడు. వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చూపుతున్నాడు. గతనెల 21న జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో మెరుగైన ప్రదర్శన చేసి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. త్వరలో పశ్చిమ గోదావరి జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడల్లో ఖాజా హుస్సేన్ జిల్లా జట్టు తరఫున ఆడనున్నాడు. జాతీయస్థాయిలో రాణించాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నట్లు హుసేన్ చెబుతున్నాడు.

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని..



నందికొట్కూరు పట్టణం బైరెడ్డి రాజశేఖరరెడ్డి నగర్‌కు చెందిన రాజు, శాంతి దంపతుల కుమారుడు కాటెపోగ్ చరణ్. కోటా ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఫుట్‌బాల్ క్రీడపై ఆసక్తి చూపుతుండటంతో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రోత్సహించారు. గతేడాది నుంచి పోటీల్లో పాల్గొంటున్నాడు. జిల్లాస్థాయిలో జరిగిన పలు పోటీల్లో రాణించాడు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. సెప్టెంబరు 28 నుంచి 30వ తేదీ వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లా జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలకంగా ఆడాడు. చదువుతో పాటు క్రీడల్లో జాతీయస్థాయిలో ప్రతిభ చూపి క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలన్నదే తన లక్ష్యం అంటున్నాడు చరణ్.

ప్రభుత్వ గృహాల కూల్చివేత

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని శిశుమందిర్ పాఠశాల వెనుక ఉన్న రెండు ప్రభుత్వ గృహాలను కొందరు మంగళవారం కూల్చివేశారు. ఏ-టైపు గృహాల కూల్చివేతపై స్థానికంగా పలువురు చర్చించుకుంటున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని యర్రగుంట్ల శివారులో ఉన్న కేసీ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై జగన్‌మోహన్ మంగళవారం తెలిపారు. కాల్వలో పురుషుడి మృతదేహం కొట్టుకొచ్చినట్లు గ్రామస్థులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్లు ఉంటుందన్నారు.

ఎరువుల విక్రయాల నిలిపివేత

గడివేముల, న్యూస్‌టుడే : గడివేములలోని దుర్గాభవాని ఎరువుల దుకాణంలో రూ.1.71 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను నిలిపివేసినట్లు వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి తెలిపారు. మంగళవారం దుకాణంలో తనిఖీలు చేశామన్నారు.

మద్యం దుకాణాల సిబ్బంది సమ్మె

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాలలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేయడంతో వాటిలో పనిచేసే సిబ్బంది మంగళవారం దుకాణాలు మూసివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది మద్దిలేటి, ఓబులేసు, మౌలాలి మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసి వేయడంతో తాము ఉపాధి కోల్పోయినట్లు తెలిపారు. అనంతరం తమ సమస్యలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్‌కు వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆయన చెప్పడంతో సాయంత్రం 6 గంటల తర్వాత మద్యం దుకాణాలు తెరిచారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: శ్రీశైలం నియోజకవర్గంలో రైతుల కోసం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఐకేఎస్ నాయకుడు వీరన్న డిమాండు చేశారు. మండలంలోని కరివేన గ్రామంలో వారు మంగళవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. అధిక వర్షాలతో పంట దిగుబడి తక్కువగా వచ్చిందన్నారు. అరకొర వచ్చిన దిగుబడులను అమ్ముకోవాలంటే వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. మద్దతు ధర కల్పించాలని కోరారు. ఏఐకేఎస్ నాయకులు కృష్ణమోహన్, సుబ్బారావు, రవి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ఆళ్లగడ్డ వాసి మృతి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఆళ్లగడ్డకు చెందిన అక్బర్‌బాషా (46) మృతి చెందినట్లు ఎస్సై నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి ఆళ్లగడ్డకు వచ్చేందుకు సంగారెడ్డి నుంచి తిరుపతికి వెళ్తున్న బస్సు ఎక్కారు. పాణ్యం సమీపంలోని ఒక హోటల్ వద్ద టీ తాగేందుకు బస్సు నిలిపినప్పుడు ఆయన సీటులో కూర్చునే మృతి చెందినట్లు గుర్తించారన్నారు. దారి మధ్యలోనే గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని ఎస్సై అభిప్రాయపడ్డారు. దర్జీగా పనిచేసే అక్బర్‌బాషా ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లారన్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

చాగలమర్రి న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నిత్యం



సభ్యత్వ నమోదులో పీఆర్‌టీయూ నాయకులు

కృషి చేస్తుందని పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్‌లీవ్స్, ఏపీజీఎల్ఐ, డీఏను వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కౌన్సిలర్ నారాయణమూర్తి, నరసింహారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, దాదాపీర్, సూర్యం, సహదేవరెడ్డి, మాబుబాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఈ నెల 4న ఉద్యోగమేళా

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డోన్ పట్టణంలోని న్యాక్ కేంద్రంలో ఈ నెల 4వ తేదీన నిరుద్యోగ యువతి యువకులకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు ఉన్న అభ్యర్థులు పాల్గొనాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల: **సమస్య :** మండలంలోని రాముని మాన్యం కాలనీలో సీసీ రహదారిని ఏర్పాటు చేయాలి – ఫక్కీరయ్య

సమాధానం : ప్రతిపాదనలు పంపించాము. – నాగేంద్రుడు. ఈవోపీఆర్డీ. శిరివెళ్ల

దొర్నిపాడు: **సమస్య :** క్రిష్టిపాడు గ్రామంలోని ఓసీ కాలనీలో ఆలయాలకు వెళ్లే ప్రధాన రహదారిలో మురుగు నీరు ఎక్కువగా ప్రవహిస్తోంది. – బాషా, క్రిష్టిపాడు.

సమాధానం : పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – శివరామిరెడ్డి గ్రామ సర్పంచి క్రిష్టిపాడు.

ప్యాపిలి, **సమస్య :** పట్టణంలోని శ్రీరామ థియేటర్‌కు వెళ్లే రహదారిలోని కాలువలో మురుగు నీరు, చెత్తాచెదారం నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. – మహాలక్ష్మి, కాలనీవాసి

సమాధానం : పంచాయతీ సిబ్బంది చేత శుభ్రం చేయిస్తాం – లక్ష్మీదేవి, సర్పంచి

శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులలో పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి తంగమణి

శెట్టి అధ్యక్షతన మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. న్యాయమూర్తితో పాటు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు పోస్టర్లను విద్యాధికారులు ప్రభాకర్, రామనర్సప్ప, ఎస్ఎస్ కాలనీ హెచ్ఎం టి. సురేష్‌బాబులతో కలిసి ప్రారంభించారు. మూఢవిశ్వాసాలు, మూఢ నమ్మకాలను పారదోలేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. చెకుముకి పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను న్యాయమూర్తి, సీఐ అందజేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, ఎస్ఎస్ బాబు, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు వెంకటరమణ, నాయకులు మౌలాలి, పాల్గొన్నారు.

దళారులకు లాభం.. రైతులకు నష్టం

ఆళ్లగడ్డ న్యూస్‌టుడే : కూరగాయలను రైతులు నుంచి వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. అవే కూరగాయలను వ్యాపారులు, ప్రజలకు మాత్రం ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఆళ్లగడ్డ ప్రాంతంలో రైతులు తమ పొలాల్లో పండించే పచ్చి మిరప కాయలను 50కేజీల బస్తాను వ్యాపారులు రూ.400కు కొనుగోలు చేస్తున్నారు. అదే కూరగాయలను వ్యాపారులు కొనుగోలుదారులకు మార్కెట్లో కేజీ రూ.40కి తగ్గకుండా విక్రయిస్తున్నారు. రైతు వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి నాలుగు రెట్లు ఎక్కువకు వ్యాపారులు అమ్ముకుంటున్నారు. ఇక వంకాయలకైతే ధర లేక రైతులు పారబోస్తున్నారు. కూరగాయల మార్కెట్లో మాత్రం వ్యాపారులు కేజీ రూ.30కి విక్రయిస్తున్నారు. రైతులు తాము పండించిన పంటలను నేరుగా విక్రయించుకునేందుకు వీలుగా రైతు బజార్లను ఏర్పాటు చేశారు. దీంతో అటు రైతులకు, ఇటు ప్రజలకు ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతు బజార్లు ఆదరణను కోల్పోతున్నాయి.

వృథాగా రైతు బజారు

ఆళ్లగడ్డలో లక్షల రూపాయలతో కట్టిన రైతు బజారు వృథాగా పడిఉంది. దాదాపు నాలుగేళ్ల క్రితమే రూ.60లక్షల మార్కెట్టు కమిటీ నిధులతో రైతు బజార్‌ను నిర్మించారు. ప్రారంభంలో ఆర్భాటంగా కొన్ని రోజులు కూరగాయలు విక్రయించిన కొద్ది రోజుల్లోనే ఈ కేంద్రం మూతపడింది. ప్రచారం, నిర్వహణ సక్రమంగా లేకపోవడం, రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందడం తదితర కారణాలతో ఈ కేంద్రానికి తాళం పడింది.



ఆళ్లగడ్డలో మూత పడిన రైతు బజార్

రైతులకు గిట్టుబాటు కాని ధరలు

ఆళ్లగడ్డలో దాదాపు 1800 ఎకరాల్లో కూరగాయలను సాగు చేస్తుంటారు. రైతు బజారు వినియోగంలో లేకపోవడంతో గత్యంతరం లేక రైతులు స్థానిక వ్యాపారులకే తమ సరుకులను తక్కువ ధరలకే విక్రయించాల్సి వస్తోంది. ఆళ్లగడ్డలో పచ్చి మిర్చి, బెండ, మునగ, వంకాయ సాగు చేస్తుంటారు. బెండను రైతుల వద్ద నుంచి మడుము (10కేజీలు రూ.150 నుంచి 200) కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో మాత్రం కేజీ రూ.40కు విక్రయిస్తున్నారు. మార్కెట్లో మూడు మునగకాయలు రూ.20కు విక్రయిస్తుండగా రైతు వద్ద వ్యాపారులు ఒక్కొక్కటి రూ.3కే కొనుగోలు చేస్తున్నారు. రైతు బజారు సేవలు అందుబాటులో ఉంటే నేరుగా రైతులే వచ్చి పంట ఉత్పత్తులు విక్రయించే పరిస్థితులు కల్పిస్తే రైతులతో పాటుగా ప్రజలు కూడా లబ్ధిపొందే అవకాశం ఉంది.

వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయిస్తున్నాం

– మధు, రైతు, ఆళ్లగడ్డ

నేను 6 ఎకరాల్లో పచ్చి మిరపను సాగు చేశాను. 50 కేజీల బస్తా కేవలం రూ.500కే విక్రయించాల్సి వస్తోంది. కూలీ, రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. రైతు బజారు అందుబాటులోకి తీసుకొస్తే మాలాంటి రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం: – నారాయణ స్వామి, కార్యదర్శి, ఆళ్లగడ్డ మార్కెట్టు యార్డు

కూరగాయలు సాగు చేసే రైతులు నేరుగా రైతు బజారుకు వచ్చి పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు 21 దుకాణాలు ఉన్నాయి. రైతు బజారులో అన్ని వసతులు ఉన్నాయి. రైతులే ముందుకు వచ్చి ఉత్పత్తులను విక్రయించుకుంటామని చెబితే అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయిస్తాం. రైతు బజారు ఉపయోగాలను రైతులకు వివరించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటాం.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

బేతంచెర్ల న్యూస్‌టుడే: పట్టణంలోని పలు కాలనీల్లో, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని కాలనీల్లో రహదారులకు ఇరువైపుల ముళ్లపొదలు పెరిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మేమున్నాం మీకు తోడుగా శీర్షికన సోమవారం వార్త ప్రచురితమైంది. కథనానికి స్పందించిన నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ మంగళవారం పొక్లెయిన్‌తో ముళ్లపొదలను, పిచ్చిమొక్కలను తొలగింపజేయించారు. ఆయా కాలనీల ప్రజలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్పందనకు వందనం

అమడాల (కోవెలకుంట్ల గ్రామీణం) న్యూస్‌టుడే: మండల పరిధిలోని అమడాల గ్రామం బీసీ కాలనీలో పని చేయని చేతి పంపును గత నెలలో మేమున్నాం మీకు తోడుగా శీర్షికతో వార్త ప్రచురించాము. స్పందించిన అధికారులు చేతి పంపును రిపేర్ చేయించారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే : ఉత్తమ పనితీరుతోనే ప్రభుత్వ అధికారులకు సమాజంలో గుర్తింపు వస్తుందని మండల ఐక్యసంఘం అధ్యక్షురాలు రేవతి పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

చాగలమర్రి, న్యూస్‌టుడే : నగళ్లపాడు గ్రామ సమీపంలోని క్రైస్తవ అనాధ వృద్ధాశ్రమంలో వృద్ధుల దినోత్సవం సందర్భంగా వైద్యులు అంజలి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

సంజామల, న్యూస్‌టుడే : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని స్థానిక పెండేకంటి పెద్దసుబ్బయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన అధ్యాపకురాలు సరళ దేవి అన్నారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మాంసం, మద్యం దుకాణాలు మూసివేయాలని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు తెలిపారు.

అవుకు, న్యూస్‌టుడే : వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని వ్యవసాయాధికారి అబ్బుల్‌హక్ సూచించారు.,

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : ఉద్యాన శాఖలో తైవాన్ స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయని ఆ శాఖ ఏవో ధరణి తెలిపారు. రైతులు రూ.22,500 డీడీ చెల్లించాలని, రూ.10వేలు తిరిగి రైతుల ఖాతాకు జమ అవుతాయన్నారు.

బనగానపల్లి గ్రామీణం : నందవరంలో వివాదంగా మారిన దారి సమస్యను బనగానపల్లి సీఐ మంజునాథ్‌రెడ్డి, నందివర్గం ఎస్సై వెంకటసుబ్బయ్యతో పాటు గ్రామపెద్దలు మంగళవారం పరిశీలించారు. దారి గురించి ఎస్సీలు, ముస్లింలు గొడవ పడుతుండటంతో పరిశీలించి తగిన పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

యశ్వంత్‌పూర్ రైలులో ఉత్తర్‌ప్రదేశ్ వాసి మృతి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. యశ్వంత్‌పూర్ నుంచి లక్నోకు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (22683)లో రామ్‌సూరత్ (43) ప్రయాణిస్తూ డోన్ రైల్వేస్టేషన్‌కు చేరుకునే సమయంలో అచేతన స్థితిలో ఉండిపోయాడు. దీంతో అతని



పరీక్షిస్తున్న రైల్వే ఆసుపత్రి వైద్యుడు

కుటుంబ సభ్యులు రైలులోని గార్డ్, టీసీకి సమాచారం అందించారు. రైల్వే ఆసుపత్రి వైద్యుడితో అతన్ని పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

ఆర్టీసీ బస్సులో ఆళ్లగడ్డ వాసి మృతి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఆళ్లగడ్డకు చెందిన అక్బర్‌బాషా (46) మృతి చెందినట్లు ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆళ్లగడ్డకు వచ్చేందుకు సంగారెడ్డి నుంచి తిరుపతికి వెళ్తున్న బస్సును ఎక్కారు. దారి మధ్యలోనే గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని ఎస్సై అభిప్రాయపడ్డారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నగదు ఆభరణాల చోరీ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల పరిధిలో షేక్ అబ్దుల్లా మదీనా శారీ సెంటర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తుల తాళాలు పగలగొట్టి రూ.65వేల నగదు, బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితుని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాపారి మోసం

రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం గ్రామానికి చెందిన వెంకట రంగనాయకులు అనే రైతు నుంచి చెన్నైకు చెందిన జగదీష్ గత నెలలో 350 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేశాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో బాధిత రైతు ఫిర్యాదు మేరకు రుద్రవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన డోన్ ఎమ్మెల్యే

డోన్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును డోన్ ఎమ్మెల్యే కోట్ల ఓర్వకల్లు



చంద్రబాబుకు డోన్ సమస్యలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

విమానాశ్రయం వద్ద మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా డోన్ నియోజకవర్గంలో వాటర్ గ్రిడ్ కింద అందించే తాగునీటి పథకం, హంద్రీనీవా కాల్వ ద్వారా చెరువులకు నీటిని నింపే అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

కష్టపడిన వారికే తెదేపాలో గుర్తింపు

డోన్, న్యూస్‌టుడే : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా ఎన్నికైన ధర్మవరం సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కుటుంబ సభ్యు



మంత్రి దంపతులను గజమాలతో సన్మానిస్తున్న సుబ్బారెడ్డి దంపతులు

లను కలిశారు. ఈ సందర్భంగా బీసీ దంపతులను భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ తెదేపాలో కష్టపడిన వారికి గుర్తింపు దక్కుతుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ధర్మవరానికి రాష్ట్ర పదవి ఇచ్చి గౌరవించారన్నారు. కొత్తూరు సుబ్బరాయుడు, నందవరం చౌడేశ్వరి ఆలయాల్లో సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మార్కెట్టు యార్డు ఛైర్మన్ మురళీకృష్ణగౌడ్ యువ నాయకులు గౌతంరెడ్డి, పట్టణ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, పెద్దనాగిరెడ్డి, చిన్న నాగిరెడ్డి, పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లి న్యూస్‌టుడే : విద్యార్థులు మంచి ప్రతిభతో ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం సంతోషదాయకమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. బనగానపల్లి పట్టణానికి చెందిన ఎం.కలీం, షేక్ లుబ్నాలైఖాకు ఎంబీబీఎస్‌లో సీటు రావడంపై మంగళవారం విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి బీసీ ఇందిరమ్మను కలిశారు. ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

రక్తదానం చేయండి ప్రాణాలు కాపాడండి

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే : నంద్యాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ నేతృత్వంలో నిర్వ



కలెక్టర్ చేతుల మీదుగా పత్రాన్ని అందుకుంటున్న డి.కె.బాబు

హించిన రక్తదాన శిబిరంలో మంగళవారం ఉయ్యాలవాడ రేనాటి సూర్య చంద్రుల కమిటీ అధ్యక్షుడు డి.కె బాబు నేతృత్వంలో కమిటీ సభ్యులు అబ్దుల్, సుబ్బరాయుడు, జయచంద్ర పాల్గొని రక్తదానం చేశారు. వీరికి నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

బేతంచెర్ల న్యూస్‌టుడే : సమాజానికి స్వచ్ఛంద సంస్థలు సేవ చేసి సమాజంలో గుర్తింపును పొందాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, రాష్ట్ర కమాండెంట్ డాక్టర్ అరవింద్ సింగ్ పేర్కొన్నట్లు లైఫ్ కన్వీనర్ రవి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా నంద్యాలలోని పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం కార్యక్రమంలో బేతంచెర్ల పట్టణానికి చెందిన లైఫ్ యువనేత్ర సభ్యులు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు.

పంటల నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డోన్, న్యూస్‌టుడే : పంటల నమోదులో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వై.వి.మురళీకృష్ణ హెచ్చరించారు. ఖరీఫ్‌లో నమోదు చేసిన పంటల నమోదులో భాగంగా మంగళవారం కొచ్చెర్వు, వెంకటనాయునిపల్లె గ్రామాలలో



పంటల నమోదు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి వైవి మురళీకృష్ణ

పంట నమోదును పరిశీలించారు. ఏఏ గ్రామాల్లో ఎంతమేర పంటల నమోదు చేపట్టారని, ఇంకా ఎంత నమోదు చేయాలనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, వ్యవసాయాధికారి అబ్దుల్‌షఫీ, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెకుముకి పోటీలు

ప్యాపిలి, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించడంతో పాటు పోటీ తత్వాన్ని విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలనే ఉద్దేశ్యంతోనే జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు డోన్ డివిజన్ జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు సర్వజ్ఞమూర్తి, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్ పేర్కొన్నారు. మొదటి బహుమతిని ప్యాపిలి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెండవ స్థానాన్ని హుస్సేనాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు అందుకున్నట్లు తెలిపారు. ,

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల న్యూస్‌టుడే : సన్న చిన్నకారు రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వసంతలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 1వ సచివాలయం పరిధిలో ఏవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండ్లతోటలు, పశువైద్యశాఖలకు సంబంధించి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహక రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో బన్నీ రాజు, ప్రజ్ఞ, మాదవలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏడీ వసంతలక్ష్మి

ఆళ్లగడ్డలో 'చెకుముకి' పరీక్షలు

ఆళ్లగడ్డ న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'చెకుముకి' పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యా



ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ

ర్థులకు విశ్రాంత జిల్లా జడ్జి శివప్రసాదరావు చేతుల మీదుగా బహుమతుల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శేషారెడ్డి, సుబ్రహ్మణ్యం, జాఫర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : ఆళ్లగడ్డకు చెందిన పలువురు తైక్వాండో క్రీడాకారులు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. నంద్యాలలోని పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో 30వ తేదీన జరిగిన ఉమ్మడి జిల్లాల తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన డింపుల్, అయినియా, జయరాజ్, గురురఘువీర్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో మానవతా సేవా సమితి కార్యదర్శి టి.అమీర్‌బాషా పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : బనగానపల్లి పట్టణానికి చెందిన ఉత్తమ ఉపాధ్యా



ఉపాధ్యాయునికి సన్మానం చేస్తున్న ఎంఈవో, తదితరులు

యునిగా ఎంపికైన ప్రతాప్‌ను కస్తూర్బా పాఠశాలలో ఎంఈవో స్వరూప, పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో -1 శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవుకు, న్యూస్‌టుడే : ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రశంస పత్రాలు పొందిన గోకుల దిన్నె పాఠశాలకు చెందిన లక్ష్మీ నారాయణరెడ్డి, ఆదర్శపాఠశాలకు చెందిన బషీర్ అహమ్మద్‌ను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) మండల శాఖ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆపస్ నాయకులు ఓబులరెడ్డి, నాగరాజు మల్లికార్జున ఉన్నారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోవెలకుంట్ల న్యూస్‌టుడే : కోవెలకుంట్లలోని సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు

ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ గీతా మంగళవారం తెలిపారు. నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో, నందవరంలో జరిగిన డివిజన్ స్థాయి వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సాన్విత, సాయిప్రియ, సంతోష్, నాగ ఉదయ్, మణికంఠ, అలీ, నవనీత్, అనిఫ్, గగనశ్రీ, అషరఫ్‌లు ప్రతిభ చూపి రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు ఓబులేసు, హర్ష పాల్గొన్నారు.

రుద్రవరం న్యూస్‌టుడే : స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అండర్-19 విభాగంలో ఆర్చరి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 30వ తేదీన కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరిలో మానస, వెంకటశ్రీవల్లి, కేతాలిన్, జగదీశ్వరీలు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులును ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక

సంజామల, న్యూస్‌టుడే : మండలంలోని కానాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి చెప్పారు. విద్యార్థులు క్రీడలకు ఎంపికయ్యేందుకు కృషి చేసిన వ్యాయమ ఉపాధ్యాయులు చిన్నమౌలాలిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ట్యాంకు శిథిలం.. చిన్నారులకు భయం



ఉయ్యాలవాడ మండల పరిధిలోని కాకరవాడలో 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకును ప్రాథమిక పాఠశాల పరిసరాలలో ఏర్పాటు చేశారు. ట్యాంకును ఏర్పాటు చేసి 36 సంవత్సరాలు కావటంతో నీటి తొట్టి పెచ్చులు ఊడి శిథిలావస్థకు చేరింది. ట్యాంకు సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. చిన్నారులు, పాఠశాల విద్యార్థులు ట్యాంకు పరిసరాలలో తిరుగుతుంటారు. అధికారులు స్పందించి ట్యాంకుకి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే ఉయ్యాలవాడ

ముందస్తు విజయదశమి వేడుకలు

డోన్‌పట్టణం న్యూస్‌టుడే: పట్టణంలోని భాష్యం ఆంగ్లమాధ్యమం పాఠశాలలో విజయదశమి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ముందస్తుగా



పాఠశాలలో విజయదశమి వేడుకల్లో చిన్నారులు

విద్యార్థులు మంగళవారం విజయదశమి వేడుకలను పాఠశాల ప్రిన్సిపల్ ఎం.శేషసాయినాథ్ అధ్యక్షతన నిర్వహించారు. చిన్నారులు తరగతి గదిలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి సాంప్రదాయ దుస్తులతో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ఎస్సైగా ఉరవకొండ నుంచి వచ్చిన ప్రవీణ్‌కుమార్ నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న నరసింహులు బద్వేలుకు బదిలీపై వెళ్లారు.

మసీదు ప్రారంభం

సంజామల, న్యూస్‌టుడే: మండలంలోని మిక్కినేనిపల్లెలో మంగళవారం దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన మసీదును ముస్లిం మతపెద్దలు ప్రారంభించారు. ముస్లింలు మతపెద్దల సమక్షంలో ప్రత్యేక ఫాతేహాలు చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు అన్వర్‌మౌలానా, నబీరసూల్, అమీర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో ప్రతిభ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ సంస్థ వారు సిల్వర్‌జూబ్లీ నిర్వహిస్తున్న సందర్భంగా గత నెల 26వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో డోన్ శ్రీసుధ సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన నాల్గోతరగతి విద్యార్థిని శ్రీకృతి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ అహమ్మద్‌నవాజ్ తెలిపారు. ప్త, సూర్యనారాయణ, హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యానం.. అధ్వానం

డోన్ పట్టణం న్యూస్‌టుడే : డోన్ పట్టణంలోని కేవీఎస్ కాలనీలో ప్రజలకు మానసిక ప్రశాంతత, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు 2009లో పురపాలక అధికారులు సాధారణ నిధుల కింద రూ.7లక్షలతో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. శారీరక, మానసిక ప్రశాంతత, ఉల్లాసం పొందేందుకు వ్యాయామం, నడక, యోగా, ధ్యానం చేసేందుకు పిల్లలు, పెద్దలు ఇక్కడికి వస్తుంటారు. కిడ్స్ వరల్డ్ వద్ద ఖాళీ స్థలంలో పిరమిడ్ కేంద్రం కోసం స్థలాన్ని కేటాయించాలని పాలకులు, అధికారులు భావించారు. తక్కువ విస్తీర్ణంలో పార్కు పురోగతి చెందకుండా పిరమిడ్ నిర్మిస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.




మరమ్మతులకు నోచుకోని కాలిబాట (వాకింగ్ ట్రాక్)

మొక్కలు ఎండిపోయాయి ట్రాక్ ఊడిపోయింది

పార్కులోని మొక్కలకు నీరందించక పోవడంతో, పిచ్చిమొక్కలు, ముళ్లకంచెలు పెరిగాయి. ప్రహరీ గోడలు ధ్వంసం కావడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. బోరు ఏర్పాటు చేసి నీటి గొట్టాలు, కుళాయిలు ఏర్పాటు చేసినా నీరందక చాలా మొక్కలు, గ్రాసం ఎండిపోయాయి. కాలిబాటలు (వాకింగ్ ట్రాక్‌లు) దెబ్బతిన్నాయి. పిల్లల కోసం కిడ్స్ వరల్డ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. కానీ ఇప్పటి వరకు మున్సిపాలిటీ అధికారులు పార్కులో కనీస సదుపాయాలు కల్పించలేదు.

నిధులు మంజూరైన టెండర్లు పిలవలేదు

పార్కులో డీఎంఎఫ్ కింద రూ. 25లక్షలతో యోగా కేంద్రాన్ని నిర్మించారు. ఈ కేంద్రం వద్ద మరుగుదొడ్లు, డ్రస్సింగ్ గదులను నిర్మిస్తామని గతంలో పాలకులు అధికారులు హామీ ఇచ్చారు. కానీ



ప్రగతికి నోచుకోని కేవీఎస్ కాలనీ మున్సిపల్ పార్కు

ఇప్పటివరకు వాటి ఊసే ఎత్తడం లేదు. మరుగుదొడ్ల నిర్మాణాల కోసం ఎన్నికల ముందు రూ.5లక్షలకు పైగా నిధులు మంజూరైన ఇప్పటి వరకు నిర్మాణాలకు టెండర్లు పిలువకపోవడం గమనార్హం. మరుగుదొడ్లు లేకపోవడంతో పార్కుకు వచ్చిన వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు ప్రజాప్రతినిధులు పార్కు సుందరీకరణ కోసం పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.